బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం


కార్పొరేటర్ శంకర్‌యాదవ్‌ను సత్కరిస్తున్న ధన్‌రాజ్ తదితరులు

అఫ్జల్‌గంజ్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బేగంబజార్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ జీ.శంకర్ యాదవ్ పేర్కొన్నారు. రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికలు గ్రేటర్ నలుమూలలా బీజేపీ విజయ ఢంకా మోగిస్తుందన్నారు. సోమవారం గౌలిగూడలోని ఆయన నివాసంలో శంకర్‌యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీతో పాటు పలు పార్టీల నాయకులు ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం జరిగిన సమావేశంలో శంకర్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీదే అధికారమన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు తోడు దొంగలని ఆయన వాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా బీఎంఎస్ యూనియన్



అబిడ్స్: ఉద్యోగులకు జీహెచ్‌ఎంసీ ఎంప్లాయీస్ బీఎంఎస్ యూనియన్ అండగా ఉంటుందని అధ్యక్షుడు జి.రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి టి.కృష్ణ పేర్కొన్నారు. సోమవారం జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలువురు ఉద్యోగులు రాజు, కుమార్, రాములు, లింగం తదితరులు తిరిగి బీఎంఎస్ యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రావు, కృష్ణ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నరేందర్, గడ్డం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల వద్ద ప్రతివారం అన్నదానం

లక్డీకాపూల్: ప్రతి వారం నగరంలోని నిమ్స్‌తో సహా పలు ఆస్పత్రుల వద్ద రోగులకు వారి సహాయకులకు అన్నదానం చేస్తున్నామని లక్ష్య సంకల్ప ట్రస్ట్ నిర్వాహకులు ఎం.రాజశేఖర్ రెడ్డి, సాధన రెడ్డి తెలిపారు. నీలోఫర్ ఆస్పత్రిలో సోమవారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ అగ్రికల్చర్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, నాంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఫిరోజ్‌ఖాన్ ప్రారంభించారు. దాదాపు 2 వేల మందికి అన్నదానం చేశారు. తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ ఎం.సంగారెడ్డి, జయంతి తదితరులు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తెలంగాణ అగ్రికల్చర్ వెల్ఫేర్ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

ఎట్టకేలకు ఫౌంటెన్‌కు మరమ్మతులు

- 2023లో రూ.29.50 లక్షల నిధులతో ఆధునీకరణ
- ఆరు నెలలకే పర్యవేక్షణా లోపం
- ఫౌంటెన్ చుట్టూ పగిలిపోయిన గ్రానైట్ రాళ్లకు మరమ్మతులు
- ఇకనైనా శాశ్వత ప్రాతిపదికన జరుగుతాయా..? లేక తూతూమంత్రమేనా..?


ఫౌంటెన్‌కు జరుగుతున్న మరమ్మతు పనులు

చార్మినార్: గుల్జార్‌హౌజ్ ఫౌంటెన్‌కు ఎట్టకేలకు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఫౌంటేన్ చుట్టూ ఏర్పాటు చేసిన గ్రానైట్ ఫుట్‌పాత్ రాళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరమ్మతులు చేయించడానికి సంబంధిత అధికారుల వద్ద సమయం లేకపోవడంతో ఇప్పటి వరకు నిర్లక్ష్యానికి గురైంది. 2023లో రూ.29.50 లక్షల నిధులతో ఆధునీకరించబడి అందుబాటులోకి వచ్చింది. రెనోవేషన్ పూర్తయిన ఆరు నెలలకే తిరిగి అధికారుల నిర్లక్ష్యానికి గురైంది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో లక్షలాది రూపాయల నిధులు నిరుపయోగంగా మారే పరిస్థితులు ఎదురయ్యాయి. రాత్రిపూట ఆకట్టుకునే రంగు రంగుల విద్యుత్ దీపాల నడుమ నీరు విరజిమ్మే ప్రక్రియ కొద్ది రోజులు నిలిచి పోయింది. ఎలాగో అలాగా తిరిగి మరమ్మతులకు నోచుకోవడంతో కొద్ది రోజులు పని చేసింది. అయితే ఫౌంటెన్ చుట్టూ రోడ్డుపై ఏర్పాటు చేసి గ్రానైట్ రాళ్లు పగిలిపోయాయి. వీటి మరమ్మతులను వెంటనే చేపట్టకపోవడంతో అటువైపు నుంచి రాకపోకలు సాగించే వారికి అంధవికారంగా కనిపించింది. ఈ విషయాన్ని అప్పట్లో అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఫౌంటెన్ అంటూ సాక్షి కథనం కూడా రాసింది. అయినా సంబంధిత అధికారుల్లో ఎలాంటి చలనం కనిపించ లేదు. ఎట్టకేలకు గ్రానైట్ రాళ్ల మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఇవి కూడా శాశ్వత పరిష్కారంగా ఉంటాయా..లేక తూతూ మంత్రంగా ఉంటుందా..? వేచి చూడాలి.

2016లో కూడా..

2016లో ఫౌంటెన్ మరమ్మతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించడంతో అప్పట్లో కూడా మరమ్మతు పనులు చేయించారు. అంతేకాకుండా గతంలో జరిగిన బయోడైవర్సిటీ సమావేశాల సందర్భంగా గుల్జార్‌హౌజ్ ఫౌంటెన్‌కు మరమ్మతులు నిర్వహించి అందుబాటులోకి తెచ్చారు. తదనంతరం మళ్లీ ఏడాదికి శిథిలావస్థకు చేరుకోవడం..మళ్లీ మరమ్మతులు చేయడం పరిపాటిగా మారింది. అయితే మరమ్మతు పనుల అనంతరం ఫౌంటెన్‌ను నిరంతరం పర్యవేక్షించాల్సిన సిబ్బంది పట్టించుకోకపోవడంతో పనికి రాకుండా పోయింది. ఫౌంటెన్‌లో చెత్తాచెదారం పేరుకుపోయింది. పేరుకుపోయిన చెత్తాచెదారంతో ఫౌంటెన్ కళాహీనంగా మారింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో గుల్జార్ హౌజ్ ఫౌంటెన్ సుందరీకరణ కోసం రూ. 29.50 లక్షలను కేటాయించి నిరంతర పర్యవేక్షణను కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి అప్పగించింది.

నిరంతర పర్యవేక్షణ అవసరం..

గుల్జార్‌హౌజ్ ఫౌంటెన్‌కు ఉన్న ప్రాధాన్యత నేపథ్యంలో మరమ్మతులు చేసిన అనంతరం సంబంధిత అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉంటే మళ్లీ మళ్లీ మరమ్మతులు చేయాల్సిన అవసరం రాదని పాతబస్తీ ప్రజలు అంటున్నారు. మరమ్మతుల పేరుతో ప్రభుత్వ ధనం దుర్వినియోగం అవుతుందంటున్నారు. ఇప్పటికైనా గుల్జార్‌హౌజ్ ఫౌంటెన్‌కు శాశ్వతంగా పూర్తిస్థాయి మరమ్మతులు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అవసరముందని పర్యాటకులు అంటున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్


ఫిర్యాదులను స్వీకరిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

చార్మినార్: ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి సాధ్యమైనంత వెంటనే ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ శంకర్ సింగ్ అన్నారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో చాంద్రాయణగుట్టలోని జోనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగిన ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట సర్కిల్‌కు చెందిన పారిశుద్ధ్య నిర్వహణ సిబ్బంది, ఇంజినీరింగ్ సమస్యపై 2 ఫిర్యాదులతో పాటు చార్మినార్ సర్కిల్‌కి చెందిన అక్రమ నిర్మాణంపై ఒకటి, ఫలక్‌నుమా సర్కిల్ పరిధిలోని వీధి దీపాల సమస్యపై ఒకటి.. ఇలా మొత్తం 4 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ మురుగునీటి సమస్య, రోడ్లు, వీధి దీపాలు ఇతర సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్, సిటీ ప్లానర్ మహమ్మద్ అబ్దుల్ మాజీద్, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్, ఏఎంసీ రాజారావు, మలేరియా సీనియర్ ఎంటామాలజిస్ట్ నామాల శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఈ ఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఈద్ మిలాప్‌లు స్నేహ సంబంధాలను పటిష్టం చేస్తాయి'


ఈద్ మిలాప్‌లో మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: ఈద్ మిలాప్ లాంటి కార్యక్రమాలు స్నేహ సంబంధాలను పటిష్టం చేస్తాయని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఫలక్‌నూమాకు చెందిన మహ్మద్ సైఫ్, జుబేర్ సోమవారం టోలిచౌకీ అక్బర్ బాగ్‌లో ఈద్ మిలాప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ..ఈద్ మిలాప్ కార్యక్రమాలు పాత విషయాలను గుర్తుకు చేసుకోవడం, స్నేహ సంబంధాలు పటిష్టం పరుచుకోవడం కోసం దోమదపడతాయన్నారు. ఇటువంటి కార్యక్రమాలు గతంలో కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, సోసైటీల వారు నిర్వహించుకునే వారు అని అయితే నేడు యువకులు సైతం గ్రూపులుగా ఏర్పడి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హబీబ్ ఆలీఖాన్, మహ్మద్ ఇమ్రాన్, మహ్మద్ సమీర్, మహ్మద్ పహాద్ తదితరులున్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించేలా కృషి


జాతీయ యాదవుల సమావేశంలో గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: యాదవులు అన్ని రంగాల్లో రాణించేలా యాదవ మహాసభ కృషి చేస్తుందని యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన గోషామహల్ నుంచి భూపాల్, మధ్యప్రదేశ్ తరలివెళ్లి అక్కడ జరిగిన అఖిల యాదవ మహాసభ జాతీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..చట్టసభల్లో మరింత పెద్ద ఎత్తున ప్రాతినిథ్యం వహించే విధంగా కృషి చేస్తానన్నారు. హైదరాబాద్ నగరంలో త్వరలోనే జాతీయ స్థాయి యాదవుల సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. యాదవులందరూ సామాజికంగా, రాజకీయంగా ఎదిగే విధంగా తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

'రాబోయేది మన ప్రభుత్వమే'


సలావుద్దీన్ లోధి

చార్మినార్: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు స్వస్తి పలకనున్నారని..రాబోయేది మన ప్రభుత్వమేనని బీఆర్‌ఎస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు వరంగల్‌లో జరిగిన పార్టీ రజతోత్సవ వేడుకలకు పాతబస్తీ నుంచి అధిక సంఖ్యలో హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు కేసీఆర్ అభిమానులకు ఆయన సోమవారం ధన్యవాదాలు తెలిపారు. పురానీహవేలీ లోని తన కార్యాలయంలో అందుబాటులో ఉన్న నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వరంగల్ సభ సక్సెస్ అయ్యిందని..ఈ ఉత్సాహంతో వచ్చే ఎన్నికల వరకు రెట్టించిన ఉత్సాహంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్


అక్రమంగా పార్క్ చేసిన వాహనాలను స్వాధీనం చేసుకుంటున్న ట్రాఫిక్ పోలీసులు

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లను సహించేది లేదని టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సుధాకర్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్సై మహ్మద్ షఫీ షేక్‌పేట్ పాత ముంబాయి జాతీయ రహదారి, టోలిచౌకీ చౌరస్తా, రుమాన్ హోటల్ తదితర ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై అక్రమంగా పార్కు చేసి ఉన్న వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ..అక్రమ పార్కింగ్‌లు ఎన్నో సమస్యలకు దారి తీస్తున్నాయన్నారు. అక్రమ పార్కింగ్ వల్ల పాత ముంబాయి జాతీయ రహదారి, హకీంపేట్ రోడ్డు, సెవన్ టూంబ్స్ చౌరస్తా, రుమాన్ హోటల్ తదితర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అక్రమ పార్కింగ్‌లకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదలకుండా వారి వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు.

షేక్‌పేట్‌లో క్యాండిల్ ర్యాలీ


క్యాండిల్ ర్యాలీలో మహ్మద్ ముస్తాఫా, సత్తార్ తదితరులు

గోల్కొండ: కశ్మీర్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రమూకలు అమాయకులను పొట్టనపెట్టుకోవడం దారుణమని సీనియర్ మజ్లిస్ నాయకులు మహ్మద్ ముస్తాఫా అన్నారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా సోమవారం షేక్‌పేట్ జైహింద్ కాలనీలో క్యాండిల్, పీస్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మన దేశం తలచుకుంటే పాకిస్తాన్‌కు గట్టి గుణపాఠం చెప్పి మట్టిలో కలిపివేయడం ఖాయమన్నారు. పాకిస్తాన్ డౌన్ డౌన్.. టెర్రరిజం డౌన్ డౌన్ అంటూ నినాదాలతో ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో జై హింద్ కాలనీ ప్రతినిధి మహ్మద్ సత్తార్, శ్రీనాథ్, మిర్జా అహ్మద్ బేగ్, మహ్మద్ గౌస్, రాజలింగం, శ్రీహరి తదితరులున్నారు.

సన్మానం


మౌలానా సుల్తాన్‌ను సన్మానిస్తున్న సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: హైదరాబాద్ మతసామరస్యానికి ప్రసిద్ధి అని గోల్కొండ జగదాంబిక అమ్మవారి వృత్తిపని సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి అన్నారు. రిసాల బజార్‌లోని ఉస్మానియా మసీదు ప్రధాన ఇమామ్ మౌలానా సుల్తాన్‌ను ఆయన ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. మసీద్ ఇమామ్‌గా ఉంటూ హిందూ ముస్లింల మధ్య సత్ సంబంధాల పెంపునకు సుల్తాన్ విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మౌలానా సుల్తాన్ మాట్లాడుతూ..తన పూర్వీకులు సైతం హిందూముస్లింల ఐక్యతకు ఎంతో కృషిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌చారి, గోల్కొండ మహంకాళి అమ్మవారి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, అంజమ్మ, న్యాయవాది వాణిశ్రీ ఉన్నారు.

చెత్త డంపింగ్‌కు చెక్

గోల్కొండ: ప్రభుత్వ పాఠశాల, ఒవైసీ ప్లే గ్రౌండ్, దర్గా లాంటి ప్రదేశం వద్ద చెత్త డంపింగ్‌పై గతంలో 'సాక్షి'పత్రికలో వచ్చిన వార్తలకు ఎట్టకేలకు బల్దియా అధికారులు స్పందించారు. పాఠశాలలకు వచ్చే విద్యార్థులు, ప్లే గ్రౌండ్‌కు వచ్చే క్రీడాకారులు ఈ చెత్త కుప్పలను దాటి వెళ్లాల్సి వచ్చేది. ఎన్నిమార్లు హెచ్చరించినా స్థానికులు లెక్క చేయకుండా చెత్తను స్కూల్ ప్రహరీ వద్దే డంప్ చేసేవారు. దీనిపై గోల్కొండ వార్డు కార్యాలయ సిబ్బంది ఆలేటి భిక్షపతి పాఠశాల ప్రహరీ వద్ద చెత్తను నివారించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా ఆ ప్రదేశాన్ని మొత్తం శుభ్ర పరిచి టెంట్ ఏర్పాటు చేశారు. టెంట్‌కు ఇరువైపులా ఇక్కడ చెత్త వేస్తే రూ.1000 జరిమానా అంటూ హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశారు.

ప్రతి కర్మాగారం భద్రతా ప్రమాణాలను పాటించాలి

గన్‌ఫౌండ్రీ: ప్రతి కర్మాగారం తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ తెలంగాణ చాప్టర్ చైర్మన్ బి.రాజగోపాల్‌రావు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర కర్మాగారాల శాఖ, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్‌ల ఆధ్వర్యంలో పని వద్ద భద్రత, ఆరోగ్య ప్రపంచ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొన్ని కంపెనీలు భద్రత ప్రమాణాలను 3వ ప్రాధాన్యతగా చూస్తున్నాయని ఈ విధానాన్ని మానుకోవాలని సూచించారు. ఈ రోజు మనం భద్రంగా విధులు నిర్వహిస్తే రేపు అంత భద్రతతో చూడగలుగుతామని తెలిపారు. భద్రత ప్రాముఖ్యతను ప్రతి కంపెనీ కూడా తెలుసుకోవాలని అందుకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.

ప్రపంచ భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో నేర్చుకున్న విషయాలను కంపెనీలలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికి తెలియజేయాలని కోరారు. అనంతరం వివిధ కంపెనీల ప్రతినిధులకు బహుమతులను అందజేశారు. అంతకు ముందు భద్రత ప్రమాణాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తొషిబా కంపెనీ డైరెక్టర్ సుచిరియో మొర్మోటో, డాక్టర్ సంజయ్ చతుర్వేది, హేమచంద్రలతో పాటు వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శాంతి కృష్ణ..కళా తృష్ణ

- బతుకమ్మ ప్రదర్శనపై గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- నేడు ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా శాంతి కృష్ణతో మాటామంతి


మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో వంగాల శాంతి కృష్ణ(ఫైల్)


మలేషియా దేశ ప్రభుత్వ పక్షాన అభినందనలు తెలుపుతున్న సందర్భంలో.. (ఫైల్)

గన్‌ఫౌండ్రీ: జానపద కళారంగంలో రాణిస్తూ సామాజిక సేవలో తరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు శాంతికృష్ణ సేవా సమితి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వంగాల శాంతి కృష్ణ. తెలంగాణ ముఖ్యమైన పండుగ అయిన బతుకమ్మ ప్రాముఖ్యతను వివరిస్తూ కళాకారులతో ఇచ్చిన ప్రదర్శన ఏకంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లను సాధించి పెట్టింది. కళాకారుడిగా, రచయితగా, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడిగా పలు రంగాల్లో రాణిస్తూ బహుముఖ ప్రజ్ఞ చూపుతున్నారు. ఈ నెల 29న ప్రపంచ నృత్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

బతుకమ్మపై ప్రత్యేక గ్రంథ రచన..

ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు కలిగిన బతుకమ్మ పండుగ జీవనంపై ఓ గ్రంథాన్ని రూపొందించారు. తద్వారా కళాకారులను తయారు చేసి తాను జానపద కళాకారుడిగా కళారంగంతో ముడిపడి ఉన్న క్రీడా, విద్య, వైద్య, సామాజిక సేవా, గ్రామీణ అభివృద్ధి, పరిశోధన, ఆధ్యాత్మిక, ధార్మిక రంగాల్లో సేవా సమితి ద్వారా సేవలందిస్తున్నారు. లలిత కళలైన సంగీతం, సాహిత్యం, నృత్యం చిత్ర లేఖనం, శిల్ప కళలో రాణిస్తున్న కళాకారులను ప్రోత్సహిస్తున్నారు.


డాక్టర్ వేంపటి శ్రావణితో నృత్య ప్రదర్శన

కూచిపూడి నృత్య బృందంతో ప్రదర్శనలు..

ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి వేంపటి శ్రావణి ఆధ్వర్యంలో వేంపటి వెంకటనారాయణ కాకతీయ నృత్య కళాక్షేత్రానికి 2014 నుంచి అధ్యక్షుడిగా సారథ్యం వహిస్తున్నారు. పలు చోట్ల వందలాదిగా నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. గ్రామంలో బతుకమ్మ పర్వదినం సందర్భంగా పలువురు కూచిపూడి నృత్య కళాకారులతో ప్రదర్శనలు ఇప్పించారు.


గిన్నిస్ బుక్ గుర్తింపు..

2016 డిసెంబర్ 25న విజయవాడలో సిలికాన్‌ఆంధ్రా యూఎస్‌ఏతో కలిసి 6117 మంది కళాకారులతో నిర్వహించిన కూచిపూడి ప్రదర్శనలో వేంపటి కళాబృందం కళాకారులతో ప్రదర్శన చేయించారు. దీనికి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ గుర్తించి సర్టిఫికెట్‌ను అందించారు. ఆ సమయంలో ఈ నృతంపై పలువురు పెద్దలు అభినందనలు సైతం తెలియజేశారు.

విదేశాలలో ప్రదర్శనలు..

కళలపై ఎంతో మక్కువ కలిగి ఉన్న శాంతి కృష్ణ స్వదేశంతో పాటు విదేశాలలో సైతం నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఏప్రిల్ 2న మలేషియాలో జరిగిన నృత్య ప్రదర్శనలో స్వయంగా ఆ దేశ ప్రధాన మంత్రి పాల్గొనగా ఆ ఉత్సవాల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేలా ప్రదర్శనలు నిర్వహించారు. హైదరాబాద్, విజయవాడ, ఢిల్లీ వంటి రాష్ట్రాలతో పాటు మలేషియా, అమెరికా వంటి దేశాలలో ప్రదర్శనలు ఇచ్చి ఆకట్టుకున్నారు.

బతికున్నంత కాలం నృత్య సేవకే అంకితం..



బతుకమ్మ పండుగపై చేసిన పరిశోధనకు గుర్తింపు దక్కడం ఎంతో సంతోషంగా ఉంది. నేను బతికి ఉన్నంత కాలం కళా నృత్య సేవలకే అంకితమై పనిచేస్తాం. వేంపటి శ్రావణితో కలిసి ప్రదర్శించి నృత్యానికి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. రాబోయే రోజుల్లో మరింత బలంగా పనిచేస్తా. - శాంతి కృష్ణ

శుభాకాంక్షలు



నాంపల్లి: ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ రాజారామ్‌ను నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.రవికుమార్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్ హెచ్‌ఓడి డాక్టర్ విజయ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి ప్రసన్న కిరణ్‌కు సత్కారం


ప్రసన్న కిరణ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అఫ్జల్‌గంజ్: ప్రముఖ కవయిత్రి, రచయిత బిచా ప్రసన్న కిరణ్‌ను జనజాగృతి కళా సమితి కవి సాయంత్రం సంస్థనిర్వాహకులు ఘనంగా సత్కరించారు. పలు కవితలు, పలు రచనల ద్వారా విశేష ప్రతిభ కనబరుస్తున్న కవయిత్రి ప్రసన్న కిరణ్‌కు సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సమాజంలో మానవాళి అభివృద్ధి కోసం, మానసిక ఉల్లాసం కోసం అందరూ సంతోషకరంగా ఉండే విధంగా కొత్త తరహా కవితలను ప్రజలముందుకు తేనున్నట్లు తెలిపారు.

పోటీ తత్వానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలి


రియాజుల్ హసన్ అఫందిని సన్మానిస్తున్న ఫజల్ ఉర్ రహ్మాన్ ఖుర్రం

చార్మినార్: ప్రపోటీ తత్వానికి విద్యార్థులు సిద్ధంగా ఉండాలనిఎమ్మెల్సీ రియాజుల్ హసన్ ఆఫంది అన్నారు. నూతనంగా ఎన్నికైన ఎంఐఎం ఎమ్మెల్సీ రియాజుల్ హసన్ అఫందిని సోమవారం సాయంత్రం పురానిహవేలీలోని డాన్ హైస్కూల్లో డాన్ విద్యాసంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రహ్మాన్ ఖుర్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అఫంది మాట్లాడుతూ..యావత్ భారత దేశంలో ముఖ్యంగా విద్యార్థినులు ముందంజలో ఉన్న తరుణంలో విద్యార్థులు సైతం పోటీ పడాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు విజ్ఞాన రంగంలో విశేష ఆసక్తిని కనబరచాలన్నారు. ఈ కార్యక్రమంలో షఫీవుల్లా ఫిరాసత్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రాంతీయ స్పోర్ట్స్ మీట్


మార్చ్ ఫాస్ట్ చేస్తున్న దృశ్యం

గోల్కొండ: నానల్‌నగర్‌లోని కేంద్రీయ విద్యాలయం నెంబర్ వన్ గోల్కొండలో సోమవారం 54వ ప్రధానమంత్రి కేంద్రీయ విద్యాలయ స్పోర్ట్స్ మీట్ ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను బ్రిగేడియల్ రాహుల్ థాప్లియాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీఎస్-1 విద్యార్థులు ప్రదర్శించిన మంకీ వీనాసే గుంజిత్ ధ్వానీ మంగళం అనే స్వాగత గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం ఆయన మార్చ్ ఫాస్ట్ తిలకించి కేంద్రీయ విద్యాలయాలు క్రమశిక్షణ, ఐక్యతకు నిదర్శనం అని అన్నారు. జాతీయ అథ్లెట్‌లు ఆవుల సాయిప్రశాంత్, సహస్రారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్, ఆకాష్‌గేరా పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కట్టుబడి ఉండాలి


వార్డు కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కట్టుబడి ఉండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ సూచించారు. సోమవారం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని కార్యాలయంలో బల్దియా వార్డు కార్యాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బల్దియా ఆఫీసుకు వెళితే అక్కడ అధికారులు అందుబాటులో ఉండడం లేదని తనకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫీల్డ్ మీద ఉన్నామంటూ చెబుతున్న వారు తమ పద్ధతి మార్చుకోవాలన్నారు. అనంతరం ఆయన షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులు రాని వారు వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయన వెంట మజ్లిస్ నాయకులు వజీఉజ్‌జమా, ఆలీముద్దీన్ తదితరులున్నారు.